క్లుప్తంగా

చిలకం రామచంద్రారెడ్డికి నివాళి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేపీ మాజీ అధ్యక్షుడు, దివంగత చిలకం రామచంద్రారెడ్డి నాలుగో వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం నగరి నుంచి గాలేరు వరకు ఆయన చేసిన పాదయాత్ర చిరస్మరణీయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దొరబాబు, షణ్ముగం, సురేష్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ల అభివృద్ధికి చర్యలు చేపట్టండి



కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో క్రిస్టియన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గం క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు రమేష్ కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు విచ్చేసిన కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేను పలువురు క్రిస్టియన్ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రితో వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో క్రిస్టియన్ల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. క్రిస్టియన్లు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని విన్నవించారు. అనంతరం ఆ నాయకులు కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు క్రిస్టియన్ నాయకులు పాల్గొన్నారు.

బాలికల రక్షణపై ప్రత్యేక దృష్టి



గుడిపాల: బాలికల హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: బాలికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. గురువారం గుడిపాలలో ఉన్న బాలికల వసతి గృహంలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆడపిల్లలకు పర్సనల్ ఐజెన్ గురించి తెలియజేశారు. తీవ్రమైన ఎండలో వడదెబ్బ తగలకుండా నీరు ఎక్కువగా తాగాలన్నారు. అన్నిరోగాలకు నీరే ఔషధమన్నారు. హాస్టల్‌లో వంటగది, పిల్లలు నిద్రించే గది, బాత్రూంలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాల సూర్యనారాయణ, ఏఎన్‌ఎం జబసెల్వి, విజయ, ఎంఎల్‌హెచ్‌పీ ఉమామహేశ్వరి, చంద్రశేఖర్, ఆశావర్కర్లు సుజిమ, స్వప్నలు పాల్గొన్నారు.

కిరాత వైష్ణవీ మాతగా అమ్మవారు

చౌడేపల్లి: మండలంలోని పుదిపట్ల సమీపంలో వెలసిన వైష్ణవీ దేవి ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అమ్మవారు కిరాత వైష్ణవీ మాత అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా బిల్లేరుకు చెందిన భార్గవి కుటుంబ సభ్యులు వ్యవహరించినట్లు అర్చకురాలు శ్రావణి తెలిపారు. వారాహి సౌందర్యలహరి పారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆరోగ్యం.. మహో బాల్యం

వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరైన అవగాహన లేక టీకాలు వేయించుకోవడం లేదు. దీనివల్ల వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది గ్రామీణ మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

- గర్భిణులు, పురిటి బిడ్డలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది
- అవగాహన లేమితో దూరంగా ఉంటున్న గ్రామీణులు
- ప్రతి శని, బుధవారాల్లో ఉచితంగా టీకాలు
- చిన్నారుల జీవితాలకు భరోసా



చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గుడిపాల: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి టీకాలను వేస్తున్నారు. చిత్తూరు నియోజకవర్గంలో గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో పీహెచ్‌సీలతో పాటు 26 విలేజ్ క్లినిక్‌లలో టీకాలు వేస్తున్నారు. దీంతో పాటు చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి, సబ్‌సెంటర్‌లలో కూడా టీకాలు వేయడం జరుగుతోంది.

వ్యాక్సిన్‌లు వేసేది ఇలా..

- గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలలు నిండిన తరువాత ఒక టీటీ ఇంజెక్షన్, అనంతరం ఇంకో నెలరోజుల వ్యవధిలోనే మరో టీటీ ఇంజెక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్స్ ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హైపటైటీస్–బీడోస్ వేయాలి. వీటివల్ల పోలియో, పచ్చకామెర్ల వ్యాధి నుంచి రక్షణ కల్పిస్తుంది. 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. 6, 14 వారాల్లో ఐపీ చుక్కలు వేయించాలి.
- 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయించాలి. తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకూ ప్రతి ఆరునెలలకు ఒకసారి విటమిన్–ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు ఇప్పించాలి
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోస్ డీపీటీ, మీజిల్స్, విటమిన్–ఏ ఓపీని వేయించాలి

టీకాలు తప్పనిసరి..



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా టీకాలు వేస్తున్నాం. మారుమూల ప్రాంతాల వారికి టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం.
–డాక్టర్ సంధ్య, వైద్యురాలు, గుడిపాల పీహెచ్‌సీ



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

వైద్య సిబ్బందికి శిక్షణ

యాదమరి: స్థానిక వైద్యసిబ్బందికి జిల్లా కోఆర్డినేటర్ శివరామ కృష్ణ యు–విన్ యాప్‌పై శిక్షణ కల్పించారు. గురువారం ఆయన మండల పరిధిలోని జోడి చింతల శుచి కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల వైద్యాధికారి డా.అనిల్ కుమార్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, పిల్లల టీకాల పంపిణీ వివరాలను విధిగా యు–విన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. తద్వారా ప్రతి టీకా డిజిటల్‌గా నమోదు చేయడం వల్ల టీకా మోతాదును సకాలంలో అందించవచ్చన్నారు. ఇప్పటివరకు టీకా వివరాలను మ్యాన్యువల్‌గా నిర్వహించేవారమని, ఇక మీదట అలా కాకుండా పోర్టల్‌లో నమోదు చేయాలని కోరారు. డిఫ్తీరియా, మీజిల్స్, రూబెల్లా వంటి అనేక రకాల వ్యాధులను ఎదుర్కొనేందుకు గర్భిణులు, చిన్నారులకు టీకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుని సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అంజరయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఘనస్వాగతం దగ్గర ఉండి స్వామివారి దర్శన సేవలు చూశారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేశారు. అనంతరం డీఈఓ తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. డీఈఓ సాగర్ బాబు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు పాల్గొన్నారు.

గోతి తీసి.. నిర్లక్ష్యంగా వదిలేసి..



అరగొండ కొత్త బస్టాండులో పంచాయతీ అధికారులు పగులకొట్టిన సిమెంటు రోడ్డు

తవణంపల్లె: మండలంలోని మేజర్ పంచాయతీలోని కొత్త బస్టాండులో ఇంజినీర్లు, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారింది. ఇక్కడ సిమెంటు రోడ్డు నిర్మించినా వర్షం బయట వెళ్లకుండా నీరు నిల్వ చేరి కుంటను తలపించేది. దీంతో వాహనాలు, ప్రజలు బస్టాండుకు వెళ్లినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. బస్టాండులో వర్షపునీరు నిల్వ చేరకుండా కాలువ ఏర్పాటు చేయాల్సి ఉండగా పంచాయతీ అధికారులు సిమెంటు రోడ్డును ధ్వంసం చేసి అదనపు నిధులు కేటాయించి అసంబద్ధంగా పనులు చేపట్టడంపై మండిపడుతున్నారు. అరగొండ బస్టాండు మీదుగా అర్ధగిరి వీరాంజనేయస్వామి దేవస్థానానికి వెళ్లే రోడ్డు కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం బస్టాండులో సిమెంటు రోడ్డును పగులగొట్టి గోతి తీయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు ఇకనైనా బస్టాండులో వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవడంతో పాటు గోతిని పూడ్చి సిమెంటు రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదనక చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై అరగొండ పంచాయతీ కార్యదర్శి మురుగేష్‌ను వివరణ కోరగా బస్టాండులో వర్షం నీరు నిల్వ చేరకుండా చేయడానికి సిమెంటు రోడ్డును పగులకొట్టి మళ్లీ రోడ్డు నిర్మిస్తామన్నారు. గుజ్జు ఫ్యాక్టరీలకు లారీలు వెళ్లడానికి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో కొద్ది రోజులు పనులు ఆపినట్లు తెలిపారు. రేపటి నుంచి పనులు చేపట్టి పూర్తి చేయించి ప్రజల రాకపోకలకు సౌకర్యం కల్పిస్తామన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీ కానుకల లెక్కింపు జరగనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆస్థాన మండపంలో హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని అంబేడ్కర్ భవనం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ క్రమంలో ఏఎస్‌ఐ అశ్వర్ధనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అతను పట్టణంలో భిక్షాటన చేసుకుంటు జీవిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

7 నుంచి మహాభారత యజ్ఞం

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతం మిట్ట వద్ద ఈ నెల 7 నుంచి మహాభారత యజ్ఞం ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో 18 రోజుల పాటు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. భాగవతారణి జ్యోత్స్న ప్రతి రోజూ మధ్యాహ్నం హరికథా గానం చేస్తారని, రాత్రి నాటక ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



జొన్నగురకలలో వృద్ధులకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు



నలిశెట్టిపల్లెలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. గురువారం మండలంలోని జొన్నగురకలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 48 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిస్తే వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నలిశెట్టిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని నలిశెట్టిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. గర్భిణులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలం కబ్జా

పలమనేరు: అధికారం అండతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. చెరువులు, వాగులు, వంకల నుంచి ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా వారి కన్ను ప్రభుత్వ స్థలాలపై పడింది. మండలంలోని పలమనేరు– గుడియాత్తం రోడ్డులోని ఆర్‌అండ్‌బీ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. కొల్లబాబు, నరసింహులు అనేవారు పెంగరగుంట పంచాయతీ చిన్నకుంట వద్ద ఆర్‌అండ్‌బీ స్థలంలో ఐదుసెంట్ల స్థలాన్ని కబ్జాచేసి పక్కనే ఉన్న పుల్లల చెరువులోంచి జేసీబీలతో మట్టి తోలి లెవలింగ్ చేశారు. ఈ మార్గంలో ముసలిమొడుగు వద్ద కుంకీ ఎలిఫెంట్ ప్రాజెక్టు ఏర్పాటైంది. దీంతో ఏనుగులను చూసేందుకు పట్టణం నుంచి నిత్యం సందర్శకులు ఎక్కువ మంది వస్తుంటారు. ఈ క్రమంలో రోడ్డు పక్కన స్థలాలు ఆక్రమించుకుని షాపులు పెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు మండలానికి చెందిన ఒక కీలక పచ్చనేత వారికి అండగా వున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. జిల్లా అధికారులైనా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పెంగరగుంట పంచాయతీ చిన్నకుంట వద్ద ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బీ స్థలం

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

గుడిపాల: మహిళల ఆర్థికాభివృద్ధికి శ్రీజ డెయిరీ కృషి చేస్తోందని డెయిరీ ఏరియా మేనేజర్ మహేశ్వర్ రెడ్డి, ఏరియా పీబీఐ అధికారి నాగభూషణం యాదవ్ అన్నారు. గురువారం బొమ్మసముద్రంలో శ్రీజ డెయిరీ 11వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ ఎన్నో విజయాలు సొంతం చేసుకుని ప్రపంచంలో అతిపెద్ద మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీగా ఆవిర్భవించిందన్నారు. శ్రీజతో మహిళా యజమానుల అనుబంధం శాశ్వతంగా ఉండాలని కార్యనిర్వహణాధికారి తిమ్మప్ప, హెడ్ ప్రొక్యూర్మెంట్ రాజేంద్రప్రసాద్ సందేశాన్ని పంపారు. పది సంవత్సరాలుగా డెయిరీలో అత్యధిక రోజులు, అధిక పాలు సరఫరా చేసి అధిక పాలడబ్బును తీసుకున్న మహిళా యజమానులకు మెమెంటో షీల్డు, పూలదండ, వాటర్‌బాటిల్, శాలువాతో శ్రీజ యాజమాన్యం సన్మానించారు.



మహిళలను సన్మానిస్తున్న శ్రీజ డెయిరీ యాజమాన్యం

బుద్ధుడి విగ్రహం ధ్వంసం దారుణం



నిరసన తెలుపుతున్న బాస్ నాయకులు

వి.కోట : మదనపల్లి సమీపంలో బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు గణపతి డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఆ సంఘం సభ్యులతో కలిసి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లి సమీపంలోని అంకిశెట్టిపల్లి వద్ద ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహం తలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం ధ్వంసం చేశారని పేర్కొన్నారు. అక్కడున్న సీసీ కెమెరాలను సైతం పగులగొట్టారని తెలిపారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాస్ నాయకులు వినోద్, నాగరాజు, అశ్వత్, రాజగోపాల్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్తవి ఇవ్వరు.. ఉన్నవి తొలగిస్తున్నారు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నేటికీ ఒక్కటంటే ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదు. కొత్తవి మంజూరు చేయక పోగా ఉన్న వాటిలో కోత విధించే పనిలో ఉంది. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు మాత్రం వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదని, ఓపెన్ అవగానే వివరాలు వెల్లడిస్తామని తిప్పి పంపుతున్నారు. దీంతో ఆశావహులు పింఛన్ కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నారు.

- ఏడాదవుతున్నా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- వెబ్‌సైట్ ఓపెన్ అయితే చెబుతామంటున్న అధికారులు
- పూతలపట్టు నియోజకవర్గంలో 2వేల మందికి పైగా ఎదురుచూపులు
- పాత పింఛన్లను తొలగిస్తుండడంపై లబ్ధిదారుల ఆగ్రహం



ఎంపీడీఓ కార్యాలయం

ఐరాల: గత ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు కొత్త పింఛన్ల ఊసేలేదు. వితంతు పింఛన్లు మంజూరు కాక పూతలపట్టు నియోజకవర్గంలో వందల సంఖ్యలో మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు అల్లాడిపోతున్నారు. కనీసం పింఛన్ అయినా అందితే మందుల ఖర్చుల కోసం అయినా ఎవరిపైనా ఆధార పడాల్సిన అవసరం రాదు అని కన్నీళ్లు పెడుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఎన్నికల ముందుల ప్రగల్బాలు పలికిన చంద్రబాబు ఆ హామీ గురించి అసలు ఆలోచనే చేయడం లేదు.

2 వేల మందికి పైగా ఎదురు చూపులు

పూతలపట్టు నియోజకవర్గంలో ఐదు మండలాల్లో దాదాపుగా 2 వేలకు పైగా అర్హులైన వారు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇక 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తే అంతే. ఎంతమందో చెప్పలేం. పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడం కోసం నిరంతరం వీరంతా సచివాలయాలు చుట్టూ, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొందరు టీడీపీ నేతల ఇళ్ల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. అయితే వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని అధికారులు సమాధానమిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంవత్సరం పొడువునా వెబ్‌సైట్ అందుబాటులో ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంవత్సరం దాటినా కొత్త పింఛన్ల ధ్యాసే లేదు. అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి ఏ ఆదేశాలు లేకుండా దరఖాస్తులు స్వీకరించలేమని లబ్ధిదారులకు తెగేసి చెప్పి పంపుతున్నారు.

ఎన్నడు ఇస్తారో ?



కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నా. నాకు కుమారుడు ఉన్నాడు. ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఒక సెంటు భూమి కూడా లేదు. రోజూ కూలీకి వెళ్లి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. పింఛన్ వస్తే తమకెంతో ఆసరాగా ఉంటుందని నెలనెలా కార్యాలయాలు చుట్టూ, సచివాలయం చుట్టూ తిరుగుతున్నా. మా సమస్య ఎన్నడు తీరుతుందో.
–కె.రేవతి, గుట్టకిందపల్లె, ఐరాల

ఆదేశాలు రాగానే స్వీకరిస్తాం



కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. పాత పింఛన్ల పరిశీలన పూర్తయిన తరువాత కొత్త వాటికి అవకాశం ఉంటుంది. భర్త చనిపోయిన భార్యకు వితంతు పింఛన్ వెంటనే అందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందితే అర్హులు దరఖాస్తులను స్వీకరించి వెబ్‌సైట్ ఓపెన్ అయితే అందులో పొందుపరచి కొత్తవి పింఛన్లు మంజూరు చేస్తాం.
–ధనలక్ష్మి, ఎంపీడీఓ, ఐరాల